మహాయుతిదే మహారాష్ట్ర

- 233 స్థానాలతో మళ్లీ అధికారం కైవసం
- మహా వికాస్ అఘాడీకి ఘోర పరాజయం
- దారుణంగా దెబ్బతిన్న కాంగ్రెస్ పార్టీ
- 101 స్థానాల్లో పోటీ.. గెలిచినవి 16

ముంబై, నవంబర్ 23: మహాయుతికే మహారాష్ట్ర ప్రజలు జైకొట్టారు. హోరాహోరీ అనుకున్న పోరులో ఏకపక్ష విజయాన్ని కట్టబెట్టారు. 288 నియోజకవర్గాలకు గానూ 233 స్థానాల్లో గెలిపించి మళ్లీ అధికారంలో కూర్చోబెట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీకి దారుణ ఓటమిని మిగిల్చారు. లోక్‌సభ ఫలితాలను పునరావృతం చేసి రాష్ట్రంలో అధికారాన్ని కైవసం చేసుకోవాలనుకున్న అఘాడీ కేవలం 49 స్థానాలకే పరిమితమైంది. 101 స్థానాల్లో పోటీ చేసి కూటమిలో పెద్దన్న పాత్ర పోషించాలనుకున్న కాంగ్రెస్‌కు ఘోర పరాభవం ఎదురైంది. ఆ పార్టీ అతి కష్టమ్మీద కేవలం 15 స్థానాలనే గెలుచుకుంది. మాజీ ముఖ్యమంత్రులు ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌కు ఎన్నికల ఫలితాలు రాజకీయంగా కోలుకోలేని దెబ్బకొట్టాయి. మహాయుతి హవాలో చిన్న పార్టీలు పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. ప్రతిపక్షంలో ఏ పార్టీకీ 10 శాతం సీట్లు దక్కకపోవడంతో అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కూడా సాధించలేకపోయాయి.

ఎన్నికల ఫలితాలపై మీడియాతో మాట్లాడుతున్న సీఎం ఏక్‌నాథ్ షిండే

మహాయుతికి తిరుగులేని విజయం

మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో చేదు ఫలితాలు పొందిన మహాయుతి కూటమి తిరిగి పుంజుకుంది. ఆరు నెలల్లోనే ప్రజాతీర్పును అనుకూలంగా మార్చుకొని ఘన విజయాన్ని సాధించింది. ఏక్‌నాథ్ షిండే, దేవేంద్ర ఫడ్నవీస్ కాంబో గ్రాండ్ సక్సెస్ అయ్యింది. అజిత్ పవార్ రూపంలో కూటమికి అదనపు బలం చేకూరింది. 'ఏక్ హైతో సేఫ్ హై' అంటూ ఇచ్చిన నినాదం ఫలించింది. లడ్కి బహిన్ యోజన వంటి పథకాలు ఓట్లు కురిపించాయి. దీంతో 288 స్థానాలకు గానూ 233 స్థానాల్లో మహాయుతి అభ్యర్థులు విజయం సాధించారు. బీజేపీ 149 నియోజకవర్గాల్లో పోటీ చేసి ఏకంగా 132 స్థానాలను దక్కించుకుంది. 81 స్థానాల్లో పోటీ చేసిన సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 57 స్థానాల్లో విజయం సాధించింది. అజిత్ పవార్ నాయకత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ 59 స్థానాల్లో బరిలో నిలిచి 41 చోట్ల గెలిచింది. మహాయుతిలోని జన్ సురాజ్య శక్తి రెండు స్థానాల్లో, రాష్ట్రీయ యువస్వాభిమాన్ పార్టీ ఒక స్థానంలో, రాజర్షి షాహు వికాస్ అఘాడీ ఒక స్థానంలో గెలుపొందాయి.

మహా వికాస్ అఘాడీకి దారుణ పరాభవం

మరాఠా ఓటర్లు మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)కి ఘోర ఓటమిని కట్టబెట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఈ కూటమి ఇచ్చిన హామీలను జనం నమ్మలేదు. లోక్‌సభ ఎన్నికల్లో 48 స్థానాలకు గానూ 30 స్థానాలు ఇచ్చి జై కొట్టిన ఓటర్లే ఇప్పుడు మొఖం చాటేశారు. దీంతో 288 స్థానాలకు గానూ కేవలం 49 స్థానాలకే ఎంవీఏ పరిమితమైంది. కాంగ్రెస్ 101 స్థానాల్లో పోటీ చేసిన కేవలం 16 స్థానాలనే దక్కించుకుంది. శివసేన(యూబీటీ) 95 స్థానాల్లో బరిలో నిలిచి కేవలం 20 స్థానాలను గెలుచుకుంది. 86 చోట్ల పోటీ చేసిన ఎన్సీపీ(ఎస్పీ) 10 స్థానాల్లో విజయం సాధించింది. ఈ కూటమిలోని సమాజ్‌వాదీ పార్టీ రెండు స్థానాలను, పీడబ్ల్యూపీఐ ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. కాంగ్రెస్ తరపున పీసీసీ చీఫ్ నానా పటోలే, మాజీ సీఎం పృథ్విరాజ్ చవాన్, కీలక నేత బాలాసాహెబ్ థోరట్ ఓటమిపాలయ్యారు.

చిన్న పార్టీల ప్రభావం నిల్లు

మహాయుతి హవాలో చిన్న పార్టీలు సైతం కొట్టుకుపోయాయి. రాజ్ ఠాక్రే నేతృత్వంలోని ఎంఎన్ఎస్ 125 స్థానాల్లో, ప్రకాశ్ అంబేద్కర్ నాయకత్వంలోని వీబీఏ 200 నియోజకవర్గాల్లో పోటీ చేయగా ఒక్క చోటా విజయం సాధించలేదు. రాజ్ ఠాక్రే కుమారుడు అమిత్ ఠాక్రే ఓడిపోయారు. 17 స్థానాల్లో పోటీ చేసిన ఎంఐఎం మాలేగావ్ సెంట్రల్ స్థానంలో మాత్రమే 75 ఓట్ల స్వల్ప మెజార్టీతో విజయం సాధించింది.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు



మహాయుతి కూటమి		ఎంవీఏ	
బీజేపీ	132	శివసేన(ఉద్ధవ్)	20
శివసేన	57	కాంగ్రెస్	16
ఎన్సీపీ	41	ఎన్సీపీ(ఎస్పీ)	10
ఇతరులు	3	ఇతరులు	3

రెండు కూటములకు చెందనివారు 6

శివసేన, ఎన్సీపీ భవిష్యత్తు తేల్చిన ఓటర్లు

శివసేన, ఎన్సీపీ భవిష్యత్తుపైనా ఆయా పార్టీల ఓటర్లు ఈ ఎన్నికల ద్వారా స్పష్టతనిచ్చారు. శివసేనను చీల్చి అధికారం చేపట్టిన ఏక్‌నాథ్ షిండేకు, ఎన్సీపీని చీల్చిన అజిత్ పవార్‌కే జై కొట్టారు. తమవే అసలైన పార్టీలని ఇప్పటికే కోర్టులో నిరూపించుకున్న ఈ ఇద్దరు నేతలు ఇప్పుడు ప్రజామోదాన్ని సైతం పొందినట్టయ్యింది. ఐదు దశాబ్దాలుగా మరాఠా రాజకీయాల్లో కీలకంగా నిలిచిన ఠాక్రే కుటుంబం, శరద్ పవార్‌కు ఈ ఫలితాలు చేదు జ్ఞాపకాన్ని మిగిల్చాయి. ఎన్నికల్లో ఇద్దరు నేతల ప్రభావం కనిపించలేదు. పార్టీల్లో తిరుగుబాట్ల వల్ల ప్రజా సానుభూతిని వీరు పొందలేకపోయారు.

కౌన్ బనేగా మహా ముఖ్యమంత్రి?

ముంబై: మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి ఘన విజయం సాధించడంతో ఇప్పుడు ముఖ్యమంత్రి ఎవరు అవుతారన్న అంశంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ మొదలైంది. ఈ ఎన్నికల్లో బీజేపీ సాధించిన అనూహ్య విజయం కారణంగా ఆ పార్టీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించవచ్చునని అంచనా వేస్తున్నారు. దీనిపై ఫడ్నవీస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎవరన్నది తమ కూటమిలోని మూడు పార్టీలు నిర్ణయిస్తాయన్నారు. మూడు పార్టీల నేతలు సమావేశం అవుతారని హోం మంత్రి అమిత్ షా కూడా చెప్పారన్నారు. కాగా, ఫడ్నవీస్‌కు ఆర్ఎస్ఎస్ ఆశీస్సులు కూడా పుష్కలంగా ఉన్నాయి. బీజేపీ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఇంకా 20 సీట్లు మాత్రమే అవసరం. ఈ పరిస్థితుల్లో కూటమి పార్టీలైన ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలు ముఖ్యమంత్రి పీఠాన్ని డిమాండ్ చేసే పరిస్థితిలో లేవు. అయితే ఎక్కువ సీట్లు వచ్చిన పార్టీకే సీఎం పదవి దక్కాలన్న ఫార్ములా ఏదీ లేదని సీఎం షిండే వ్యాఖ్యానించడం గమనార్హం.

ఎంఐఎంకు ఎదురుదెబ్బ

ముంబై: అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎంకు మహారాష్ట్ర ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలింది. ఔరంగాబాద్ ఈస్ట్‌లో ఈ పార్టీ అభ్యర్థి ఇంతియాజ్ జలీల్ ఓడిపోయారు. ఇక్కడి నుంచి బీజేపీ అభ్యర్థి అతుల్ సావే 2,161 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. ఔరంగాబాద్ సెంట్రల్ నియోజకవర్గంలో ఏఐఎంఐఎం అభ్యర్థి నసీరుద్దీన్ సిద్ధిఖీపై శివసేన అభ్యర్థి ప్రదీప్ జైస్వాల్ 8,119 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు.

హేమంత్‌కే జార్ఖండ్ 'జై'

- 56 స్థానాలతో జేఎంఎం కూటమి ఘన విజయం
- రెండోసారి అధికారం చేపట్టనున్న హేమంత్ సోరేన్
- కలిసొచ్చిన సానుభూతి.. అండగా నిలిచిన ఆదివాసీలు
- 21 స్థానాలతో మళ్లీ ప్రతిపక్షానికే బీజేపీ పరిమితం

రాంచి, నవంబర్ 23: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో జార్ఖండ్ ముక్తి మోర్చా కూటమి ఘన విజయం సాధించింది. హేమంత్ సోరేన్‌కు జార్ఖండ్ జనం మళ్లీ పట్టం కట్టారు. అరెస్టుతో కలిసొచ్చిన సానుభూతి, ఆదివాసీల అండ, అమలు చేసిన పథకాలు జేఎంఎం కూటమికి ఓట్లు కురిపించాయి. ఎన్డీఏ కూటమిదే అధికారం అని చెప్పిన ఎగ్జిట్ పోల్స్ పటాపంచలయ్యాయి. 56 స్థానాలతో జేఎంఎం కూటమి రెండోసారి అధికారంలోకి వచ్చింది. జార్ఖండ్‌లో గెలుపు కోసం బీజేపీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆ పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి కేవలం 24 స్థానాలతో మరోసారి ప్రతిపక్షానికి పరిమితమైంది.

జార్ఖండ్ ముక్తి మోర్చాదే జయం

జార్ఖండ్‌లో 81 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా జేఎంఎం కూటమి 56 స్థానాల్లో విజయం సాధించింది. 43 నియోజకవర్గాల్లో పోటీ చేసిన జేఎంఎం ఏకంగా 34 స్థానాలను గెలుచుకుంది. 30 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 16 సీట్లలో విజయం సాధించింది. కూటమిలో భాగంగా ఆరు స్థానాల్లో పోటీ చేసిన ఆర్జేడీ నాలుగింటిలో, నాలుగు స్థానాల్లో బరిలో నిలిచిన సీపీఐ(ఎంఎల్)(ఎల్) రెండు స్థానాలను దక్కించుకున్నాయి. గత ఐదేండ్లలో జేఎంఎం ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఓట్లు కురిపించాయి. ఎన్నికలకు ఏడాది ముందు హేమంత్ సోరేన్‌ను అరెస్టు చేయడం ఆయన పట్ల సానుభూతిని పెంచింది. ముఖ్యంగా ఆదివాసీ ఓటర్లు హేమంత్‌కు ఏకపక్షంగా అండగా నిలిచారు. అందుకే రాష్ట్రంలో 28 ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాలు ఉంటే జేఎంఎం కూటమి ఏకంగా 27 స్థానాలను కైవసం చేసుకుంది. జేఎంఎంకు సంప్రదాయ ఓటు బ్యాంకు అయిన గిరిజనులు, ముస్లింలు, క్రైస్తవులకు తోడుగా నెలకు రూ.2,500 ఇస్తామనే హామీకి ఆకర్షితులైన మహిళలు ఈ భారీ విజయాన్ని కట్టబెట్టారు.

21 స్థానాలకే బీజేపీ పరిమితం

జార్ఖండ్‌లో అధికారం ఖాయమనుకున్న బీజేపీకి పరాభవం ఎదురైంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి కేవలం 24 స్థానాలకే పరిమితమైంది. 68 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 21 స్థానాల్లోనే విజయం సాధించింది. 10 నియోజకవర్గాల్లో పోటీ చేసిన ఏజేఎస్‌యూ పార్టీ ఒక స్థానాన్ని, రెండు స్థానాల్లో పోటీ చేసిన జేడీయూ ఒక స్థానాన్ని గెలుచుకోగా, పోటీ చేసిన ఒక స్థానాన్ని ఎల్‌జేపీ(రామ్ విలాస్) కైవసం చేసుకుంది. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పెద్ద ఎత్తున ప్రచారం చేసినా, అస్సాం సీఎం ఎన్నికల బాధ్యత తీసుకొని పని చేసినా బీజేపీకి చేదు ఫలితాలే మిగిలాయి. ఆ పార్టీ ప్రధానంగా ప్రచారం చేసిన బంగ్లాదేశ్ చొరబాటుదారుల అంశాన్ని గ్రామీణ జనం పట్టించుకోలేదు. సీఎం హేమంత్ సోరేన్‌పై చేసిన అవినీతి ఆరోపణలు వికటించాయి. జేఎంఎం నుంచి వలసొచ్చిన నేతలకు పెద్దపీట వేయడం, హేమంత్ సోరేన్‌తో సరితూగే ఆదివాసీ నేతలను ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపలేకపోవడం బీజేపీని పరాజయం వైపు నడిపించాయి.

మీడియా సమావేశంలో విజయ సంకేతం చూపుతున్న హేమంత్ సోరేన్ దంపతులు

హేమంత్ – కల్పన దంపతుల మ్యాజిక్

జార్ఖండ్‌లో జేఎంఎం కూటమి విజయంలో ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్, ఆయన భార్య కల్పన సోరేన్ ప్రధాన పాత్ర పోషించారు. వీరి మ్యాజిక్‌కు జార్ఖండ్ జనం ఫిదా అయ్యారు. హేమంత్ అరెస్టయినప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన కల్పన ఏడాది లోనే పార్టీలో కొత్త, జనాకర్షక నాయకురాలిగా అవతరించారు. దాదాపు ఆమె 200 ర్యాలీలకు హాజరయ్యారు. ముఖ్యంగా మహిళా ఓటర్లను ఆమె ఆకర్షించగలిగారు.

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు



జేఎంఎం కూటమి		ఎన్డీఏ కూటమి	
జేఎంఎం	34	బీజేపీ	21
కాంగ్రెస్	16	ఏజేఎస్‌యూ	1
ఆర్జేడీ	4	జేడీయూ	1
ఇతరులు	2	ఎల్జేపీ	1

సవాళ్లకు వెరవక.. అరెస్టుకు బెదరక

49 ఏండ్ల జార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్ నాలుగోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించబోతున్నారు. తండ్రి శిబు సొరెన్ వారసత్వం కలిసొచ్చినా ఆయన రాజకీయ ప్రయాణం మాత్రం ముళ్లబాటగానే సాగింది. పార్టీలో అంతర్గత పోరాటాలు, కేసులు, అరెస్టు వంటి ప్రతికూలతలను ఎదుర్కొని ఆయన జార్ఖండ్‌లో తిరుగులేని నేతగా ఎదిగారు. అన్న దుర్గా అకాల మరణంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన హేమంత్ 2009లో రాజ్యసభ ఎంపీ అయ్యారు. 2010లో బీజేపీ సర్కార్‌లో డిప్యూటీ సీఎం పదవి అందుకున్నారు. 2013లో కాంగ్రెస్, ఆర్జేడీ మద్దతుతో 38 ఏండ్ల వయసులోనే తొలిసారి సీఎం అయ్యారు. అయితే, 2014లో అనూహ్యంగా అధికారం చేజారిపోయింది. 2019 ఎన్నికల్లో గెలిచి రెండోసారి సీఎం అయ్యారు. జనవరి 31న ఆయనను ఈడీ అరెస్టు చేసింది. అరెస్టుకు ముందే ఆయన సీఎం పదవికి రాజీనామా చేశారు. ఐదు నెలల జైలు జీవితం తర్వాత విడుదలై మరోసారి సీఎం పదవిని అందుకున్నారు. ఇప్పుడు నాలుగోసారి సీఎం కాబోతున్నారు.

బైపోల్స్‌లో అధికార పక్షాలదే హవా

న్యూఢిల్లీ, నవంబర్ 23: దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీలే సత్తా చాటాయి. మొత్తం 46 సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ, దాని కూటమి పార్టీలు 26 స్థానాల్లో గెలిచాయి. యూపీ, బీహార్, రాజస్థాన్‌లలో బీజేపీ, దాని మిత్రపక్షాలు, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు విజయం సాధించాయి. యూపీలో మొత్తం తొమ్మిది నియోజకవర్గాలలో బీజేపీ, దాని మిత్రపక్షాలు పోటీ చేయగా, ఏడింటిలో విజయం సాధించాయి. రెండింటిని సమాజ్‌వాదీ పార్టీ దక్కించుకుంది. రాజస్థాన్‌లో ఏడింటిలో పోటీ చేసిన బీజేపీ ఐదింటిని దక్కించుకోగా, కాంగ్రెస్, భారత్ ఆదివాసీ పార్టీ తలో సీటులో విజయం సాధించాయి. బీహార్‌లో నాలుగు స్థానాల్లోనూ ఎన్డీఏ క్లీన్‌స్వీప్ చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఆరు, ఆమ్ ఆద్మీ పార్టీ మూడు, సమాజ్‌వాదీ పార్టీ రెండు, రాజస్థాన్‌లో బీఏపీ ఒకటి, కేరళలో ఎల్డీఎఫ్ ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి. ఇవి కాక, సిక్కింలోని రెండు స్థానాలను సిక్కిం క్రాంతికార్ మోర్చా గెల్చుకుంది. వయనాడ్, నాందేడ్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నెగ్గింది.

వయనాడ్‌లో ప్రియాంక విజయం

తిరువనంతపురం, నవంబర్ 23: కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ 4.1 లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. సోదరుడు రాహుల్ గాంధీ వయనాడ్‌లో సాధించిన మెజార్టీ మార్క్‌ను ఆమె తిరగరాశారు. వయనాడ్ ఉప ఎన్నికలో ప్రియాంక గాంధీ 6,22,338 ఓట్లు సాధించినట్టు శుక్రవారం ఎన్నికల సంఘం ప్రకటించింది. కేరళలో అధికార ఎల్డీఎఫ్ తరపున బరిలో దిగిన సీపీఎం అభ్యర్థి సత్యన్ మోకిరి, బీజేపీ అభ్యర్థి నవ్య హరిదాస్ రెండు, మూడో స్థానంలో నిలిచారు. మోకిరికి 2,11,407 ఓట్లు, హరిదాస్‌కు 1,09,939 ఓట్లు వచ్చాయి. వయనాడ్ ప్రజల నమ్మకాన్ని నిలబెడతాననిఆమె 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో రాహుల్‌గాంధీకి 3,64,422 ఓట్ల మెజార్టీ రాగా, ఈసారి ప్రియాంక గాంధీ 4,10,931కి మెజార్టీ అందుకోవటం గమనార్హం.

తిరగబడిన 'హస్త'వాసి

- మహారాష్ట్రలో కాంగ్రెస్ పతనం
- ఈసారి 20 సీట్లలోపే పరిమితం
- ఇతర రాష్ట్రాల్లోనూ అదే పరిస్థితి
- గ్యారెంటీలపై తొలగిన భ్రమలు

ముంబై, నవంబర్ 23: మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ ఘోర పరాజయాన్ని మూటకట్టుకుంది. అదే సమయంలో జార్ఖండ్‌లో ఇండియా కూటమి భాగస్వామి జేఎంఎం తిరిగి అధికారాన్ని నిలబెట్టుకుంది. అయితే ఈ రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఇప్పటి వరకు కూటములో పెద్దన్నగా వ్యవహరించిన కాంగ్రెస్‌కు ఇక భవిష్యత్‌లో ఆ స్థానం దక్కకపోవచ్చు. ఇటీవల హర్యానా ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందని ప్రచారం జరిగినప్పటికీ ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బోల్తా కొట్టింది. నాందేడ్, వయనాడ్ పార్లమెంట్ నియోకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వయనాడ్‌ను సులభంగా నిలబెట్టుకున్న ఆ పార్టీ నాందేడ్‌లో తన సిట్టింగ్ స్థానంలో అతికష్టంగా నెగ్గింది. అయితే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పుంజుకుంటుందని భావించినప్పటికీ ఈ ఎన్నికల్లో అత్యధికంగా దెబ్బతిన్న పార్టీ కాంగ్రెస్సేనని చెప్పవచ్చు. ఆ రాష్ట్రంలో ముసుపెన్నడూ లేనంత బలహీనంగా ఆ పార్టీ పరిస్థితి దిగజారింది. చాలా ఏండ్లుగా సీట్లు తగ్గుతూ వస్తున్న ఆ పార్టీ ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో 20 లోపు స్థానాలకే పరిమితం అయ్యింది. 288 సీట్లున్న అసెంబ్లీలో ఆ పార్టీ మిగతా కూటమి పార్టీల కన్నా అత్యధికంగా 101 సీట్లలో పోటీ చేసి 16 సీట్లలో మాత్రమే విజయం సాధించింది. అంటే కేవలం 16 శాతం సీట్లలో మాత్రమే ఆ పార్టీ విజయాన్ని సాధించగలిగింది. అదే సమయంలో కూటమి పార్టీలైన ఎన్సీపీ (ఎస్పీ) 86 సీట్లలో పోటీ చేసి 10 సీట్లు నెగ్గి 11.6 విజయ శాతాన్ని, శివసేన (యూబీటీ) 95 సీట్లలో పోటీ చేసి 20 సీట్లతో 20 విజయం శాతాన్ని పొందాయి. అధికార బీజేపీ 149 సీట్లకు 132 స్థానాల్లో విజయం సాధించి 88.6 విజయం శాతాన్ని తెచ్చుకుంది.

34 ఏండ్లుగా మూడంకెలకు దూరం

గత 34 ఏండ్లుగా మహారాష్ట్రలో కాంగ్రెస్ ఎన్నడూ సొంత మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదు. 1990లో శరద్ పవార్ నేతృత్వంలో ఆ పార్టీ 141 స్థానాల్లో గెల్చింది. ఆ తర్వాత ఎన్నడూ కూడా ఆ పార్టీకి మూడంకెల సీట్లలో విజయం దక్కలేదు. శరద్ పవార్ కాంగ్రెస్ పార్టీని వీడి వేరే పార్టీ పెట్టుకోవడంతో 1995లో కాంగ్రెస్ 80 సీట్లకే పరిమితమై రెండోసారి అధికారానికి దూరమైంది. అప్పటి వరకు కాంగ్రెస్‌కు అండగా నిలచిన మరాఠా ఓట్లను ఎన్సీపీ చీల్చింది. ఆ తర్వాత విలాస్ రావ్ దేశ్‌ముఖ్ నేతృత్వంలో పార్టీ పుంజుకోకున్నా ఎన్సీపీతో పొత్తుతో అధికారం చేపట్టింది. 2008లో ముంబై దాడుల నేపథ్యంలో విలాస్‌రావు పదవిని కోల్పోయారు. 2009లో అశోక్ చవాన్ నేతృత్వంలో ఎన్నికలకు వెళ్లిన కాంగ్రెస్ 82 సీట్లను గెల్చుకుంది. 2014లో మోదీ హవా, కాంగ్రెస్‌పై అవినీతి ఆరోపణలతో 42 సీట్లు మాత్రమే వచ్చాయి. ఇక అప్పటి నుంచి ఆ పార్టీ తేరుకోలేదు. ఈ ఎన్నికల్లోనూ అదే పరిస్థితి పునరావృతమైంది. పరిస్థితి మరింత దిగజారి ఆ పార్టీకి 20 లోపే సీట్లు వచ్చాయి.

రాజ్యసభ సీట్లపై ప్రభావం

కాంగ్రెస్, దాని కూటమి పార్టీల పరాజయ ప్రభావం రాజ్యసభ ఎన్నికల్లోనూ చూపించవచ్చు. అదే సమయంలో ఎగువ సభలో అధికార బీజేపీ పూర్తి మెజారిటీ దిశగా అడుగులు వేస్తున్నది. రాజ్యసభలో కూడా బీజేపీ పూర్తి మెజారిటీ పొందితే ఇక బిల్లుల ఆమోదంలో ఆ పార్టీకి ఎదురు ఉండకపోవవచ్చు.

గ్యారెంటీలపై ప్రజల్లో తొలగిన భ్రమలు

ఎన్నిక ఎన్నికకు కాంగ్రెస్ పరిస్థితి దిగజారుతూ వస్తున్నది. ఆ పార్టీ వ్యూహాలు వరుసగా విఫలమవుతూ వస్తున్నాయి. అది ఇస్తున్న గ్యారంటీలపై ప్రజలకు భ్రమలు తొలగాయి. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఆ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలను మభ్యపెట్టిన అలవికాని హామీలే. ఈ విఫల ఉచిత హామీలపై హర్యానా ఎన్నికల్లో బీజేపీ ప్రచారం చేయడంతో ఓటర్లు తేరుకుని కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేశారు. దానికి తోడు పార్టీలోని నేతలు తమ పార్టీ విజయం కన్నా సీఎం పదవిపై మక్కువతోనే పనిచేయడంతో ఆ పార్టీకి మరోసారి అపజయం తప్పలేదు. జమ్ముకశ్మీర్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ది ఇదే పరిస్థితి. దాని కూటమి నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ (ఎన్సీపీ) అధికారం చేజిక్కించుకుంది. పూర్తి మెజారిటీ రావడంతో కాంగ్రెస్ అవసరం ఆ పార్టీకి లేకుండా పోయింది. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రధానంగా కుల గణన, అదానీ–అంబానీల అంశాలే ప్రస్తావించారని, ఇది ఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపలేదనివిశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కాంగ్రెస్‌ను నమ్ముకుని మునిగాం

కూటమి పార్టీల్లో అంతర్మథనం

ముంబై, నవంబర్ 23: మొన్న లోక్‌సభ, నిన్న హర్యానా, కశ్మీర్ ఎన్నికలు, నేడు మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు.. అన్నింటిలో ఇండియా కూటమికి ఎదురుదెబ్బలే. కూటమిలో ప్రధాన జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ తమకు ఉపయోగపడక పోగా, దానిని నమ్ముకుని నిండా మునుగుతున్నామని కూటమిలోని పార్టీల్లో అంతర్మథనం ప్రారంభమైంది. 'కూటమిలో కాంగ్రెస్ ఒక పనికిమాలిన పార్టీ' అన్న భావాన్ని కొందరు నేతలు వ్యక్తం చేస్తున్నారు. మహా నౌకలాంటి కాంగ్రెస్ తమను ఒడ్డుకు చేరుస్తుందని నమ్మామని, అయితే దానికి భారీ చిల్లు పడిందని, ఒడ్డుకు చేర్చడం మాట దేవుడెరుగు నిండా ముంచుతున్నదని ఆ పార్టీలు ఇప్పుడు పునరాలోచనలో పడుతున్నాయి. మరీ ముఖ్యంగా ఎన్నికల్లో గెలిచే సత్తా లేని రాహుల్ గాంధీ ట్రాక్ రికార్డును వారు ఇప్పుడు వేలెత్తి చూపుతున్నారు. మిగిలిన రాష్ట్రాల మాదిరిగా కాకుండా మహారాష్ట్రలో కాంగ్రెస్ దూకుడైన తీరుతో బలమైన వ్యవస్థగా ఉంది. అందుకే ఆ పార్టీ నేతలు ఈ ఎన్నికల్లో తమకు ఎక్కువ సీట్లు కావాలని పట్టుబట్టి మరీ సాధించుకున్నారు. ఎన్నికలైన తర్వాత మహావికాస్ అఘాడీ అధికారంలోకి వస్తుందని, తామే సీఎం పీఠం చేపడతామంటూ హడావిడి కూడా చేశారు. ఇది కూటమిలోని మిగిలిన పార్టీలకు చికాకు కూడా కలిగించింది.

సంబంధం లేని సమస్యల ప్రస్తావన

ఎన్నికల ప్రచారంలో ఓటర్లకు సంబంధం లేని సమస్యలు లేవనెత్తుతూ బీజేపీ పక్షాలపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలపై కూటమిలోని ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌లు అభ్యంతరం చెప్పారు. ఉదాహరణకు వీరసావర్కర్‌పై కాంగ్రెస్ చేసిన విమర్శలు ఇద్దరు నేతల మనసులను గాయపరిచాయి. దీనిపై రాహుల్‌పై ఒత్తిడి తెచ్చి ఆ విమర్శలను ఆపించినా, అప్పటికే నష్టం జరిగిపోయింది. దానిని బీజేపీ అస్త్రంగా వినియోగించి ఎంవీఏను తీవ్రంగా దెబ్బ తీసింది. అలాగే అదానీపై రాహుల్ నిత్యం విమర్శలు చేయడంపై కూడా శరద్‌పవార్ అభ్యంతరం చెప్పారు. స్థానిక సమస్యలను ప్రస్తావించకుండా సామాన్యులకు అర్థం కాని అంశాలపై విమర్శలు చేయవద్దని వారు వారించారు. కాంగ్రెస్‌తో వెళ్తేఎన్నికల్లో మునుగుడు ఖాయమని ఇప్పటికే ఆమ్ ఆద్మీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు నిశ్చయాభిప్రాయంతో ఉన్నాయని, అది గ్రహించక తాము దానితో వెళ్లి మునిగామని పలువురు ఎంవీఏ నేతలు పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నారు. కాగా, త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో మణిపూర్, అదానీ, వక్ఫ్ బిల్లు లాంటి అంశాలపై పార్లమెంట్‌లో నిలదీయాలని ఇండియా కూటమి నిర్ణయించింది. అయితే అసెంబ్లీ ఫలితాల అనంతరం పరిస్థితుల్లో మార్పు వచ్చింది. ఈ సమావేశాల్లో ఇండియా కూటమి వెంట ఎంత మంది నేతలు వెళ్తారన్నది ప్రశ్నార్థకమేనని పలువురు పేర్కొంటున్నారు. మునుపటిలా కాంగ్రెస్‌కు అగ్రస్థానం ఉండకపోవచ్చునని భావిస్తున్నారు.

క్యాన్సర్ పనిపడుతున్న కొవిడ్!

- తీవ్రతను తగ్గించేలా పని చేస్తున్న ఇన్ఫెక్షన్
- క్యాన్సర్ కణాలపై పోరాడే మోనోసైట్ల ఉత్పత్తి
-